క్లుప్తంగా

నేడు అరసవల్లిలో శ్రీలంక దేశ నాదస్వర కచేరి

అరసవల్లి: అరసవల్లి క్షేత్రంలో ఆదివారం అరుదైన కళా ప్రదర్శన జరగనుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీలంక దేశ నాదస్వర కళాకారుల బృందంతో ఆదివారం రాత్రి 9 గంటల నుంచి మరునాడు వేకువజాము (సోమవారం) 4 గంటల వరకు సుమారు 7 గంటల పాటు నిర్విరామంగా నాదస్వర కచేరీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడ తొలిసారిగా నిర్వహించనుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం, శ్రీసుమిత్ర కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రపుష్కరిణి ఆవరణలోని శ్రీవైజయంతి ఉత్సవ వేదికలో కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీలంక ఇలమ్ నాదస్వర చక్రవర్తి పీఎస్ బాలమురుగన్, కేపీ కుమరన్‌ల నాదస్వరానికి కేజీ కళ్యాణ సుందరం, వీఎన్ గణేష్‌ల సంగీత సహకారం అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిన్న శ్రీను, నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు, వాండ్రంగి ఎంపీటీసీ సభ్యుడు బూరాడ వెంకటరమణ తల్లి అమ్మడమ్మ ఇటీవల మృతి చెందారు. వాండ్రంగి గ్రామంలోని ఆ కుటుంబాన్ని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు జరుగుళ్ల శంకరరావు, లూకలాపు అప్పలనాయుడు, పైడి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎర్నేన ప్రకాశరావు, కలిశెట్టి శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ కుటుంబానికి పరామర్శ



వై.వి.సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: జెడ్పీ మాజీ చైర్మన్ వై.వి. సూర్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. అరసవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



దీక్షా శిబిరంలో నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యావతి, డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి అన్నాజీరావు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఈశ్వరి, గోవింద మల్లిబాబు, మంత్రి నర్సింహమూర్తి, కె.వెంకటరావు, బి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సౌకర్యాలపై ఆరా



జి.సిగడాంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: రానున్న ఎన్నికల్లో అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి మౌలిక సదుపాయాలపై నివేదిక అందించాలని మండల అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి పప్పల వేణుగోపాలరావుకు ఎచ్చెర్ల నియోజకవర్గం ఎన్నికల రిట్నరింగ్ అధికారి బెవర పద్మావతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జోనల్ అధికారులు, సూపర్‌వైజర్లతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అరసాడ రవి, ఎం.శ్రీనివాసరావు, వై.శారద, బగాది భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జె.ఆర్.పురం సీఐ బదిలీ

శ్రీకాకుళం క్రైమ్: జె.ఆర్.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆదాంను విశాఖపట్నం సిటీకి బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. విశాఖ జిల్లా ఆనందపురం నుంచి జి.రామచంద్రరావును జె.ఆర్.పురానికి బదిలీ అయ్యారు.

మార్కెట్‌కు నూతనోత్సాహం

- షాపులకు కొత్త సంవత్సరం కళ
- జోరుగా క్యాలెండర్లు, డైరీలు, రంగుల అమ్మకాలు
- సిద్ధమవుతున్న పుష్పగుచ్ఛాలు, పండ్ల ప్యాక్‌లు



విక్రయానికి సిద్ధంగా ఆకర్షణీయమైన బొకేలు

శ్రీకుకుళం కల్చరల్: నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు అన్ని వర్గాల ప్రజలు సన్నద్ధమవుతున్నారు. శుభాకాంక్షలు చెప్పేందుకు పండ్లు, పుష్పగుచ్ఛాలు, ప్లాస్టిక్ బొకేలు, రకరకాల గ్రీటింగు కార్డులు, డైరీలు కొనుగోళ్లతో శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ కిటకిటలాడింది. గ్రీటింగ్ కార్డులు, ముగ్గులకు వినియోగించే రంగులు విక్రయించే తాత్కాలిక షాపులు రోడ్డు పొడవునా కొలువుదీరాయి.

ఆకర్షణీయంగా బొకేలు..

మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా బొకేలను కూడా ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. ఎక్కువమంది ఒరిజినల్ పూలతోనే రూపొందించేందుకు మొగ్గుచూపుతున్నారు. ఈ పూలను ప్రత్యేకంగా బెంగళూరు నుంచి తెప్పిస్తున్నారు. వీటిని రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులకు ఇచ్చేందుకు ఎంత ధర అయినప్పటికీ కొనుగోలు చేస్తున్నారు.



డైరీలు కొనుగోలు చేస్తూ..



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

వెరైటీ గ్రీటింగ్స్..

వాట్సాప్ మాధ్యమం రాకతో గ్రీటింగ్‌కార్డులకు గతంతో పోల్చితే గిరాకీ తగ్గినా ఇంకా సంప్రదాయ కార్డులు దర్శనమిస్తునే ఉన్నాయి. చిన్నారులను ఆకర్షించేలా మిక్కీమౌస్ వంటి బొమ్మలతో గ్రీటింగ్‌కార్డులు తయారు చేసి విక్రయిస్తున్నారు. వాటి అమ్మకాలు కూడా జోరుగానే సాగుతున్నాయి.

రంగులకు గిరాకీ..

నూతన సంవత్సరం ప్రారంభంనుంచి సంక్రాంతి పండగ ముగిసే వరకు ప్రతి లోగిలి అందమైన ముగ్గులతో కళకళలాడుతుంటుంది. ఇందుకు అవసరమైన రంగులను నగరంలో పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. లూజు పొట్లాలతో పాటు ఆకర్షణీయమైన డబ్బాలు, ట్యూబులలో వీటిని అమ్ముతున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో లమీషాకు స్వర్ణం



షేక్ లమీషాను అభినందిస్తున్న హెచ్‌ఎం వాగ్దేవి, సుభాన్

శ్రీకాకుళం న్యూకాలనీ : స్విమ్మింగ్(ఈత) పోటీల్లో అదరగొట్టే ఆటతీరుతో శ్రీకాకుళంకు చెందిన లమీషా బేగం చరిత్ర సృష్టించింది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న లమీషా రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పోటీల్లో అండర్–17 విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించి నేరుగా జాతీయ పోటీలకు ఎంపికైంది. 67వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–14 బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఈ నెల 18 నుంచి 20 వరకు విజయవాడ వేదికగా జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన లమీషా బేగం రెండు బంగారు పతకాలతో సంచలనం సృష్టించింది. 200 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగాల్లో పతకాల పంట పండించింది. దీంతో 2024 జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే ఆలిండియా స్కూల్‌గేమ్స్ బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ యువ క్రీడాకారిణి ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. పోటీలకు ఎంపికైన లమీషాను శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.వాగ్దేవి, భార్గవి, సాయిప్రశాంతి, జయలక్ష్మి, రమాదేవి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. కాగా అమీషా మేనమామ షేక్ సుభాన్(సుభం) ప్రోత్సాహంతో అత్యద్భుతంగా రాణిస్తోంది. సుభాన్ జాతీయస్థాయి స్విమ్మర్‌గా పదుల సంఖ్యలో పతకాలు సాధించి కీర్తి గడించారు.

మహిమాన్వితం గురుతత్వం



రమణమహర్షి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: అన్నింటా గురుతత్వం చాలా గొప్పదని దూసి సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో రమణ మహర్షి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సత్వ, రజో, తమో గుణాలకు అతీతమైనది గురుతత్వమని రమణమహర్షి బోధనలు రుజువు చేస్తున్నాయని చెప్పారు. నేను, నాది అనే అహంకార, మమకారాలు లేనివారే సద్గురువులని పేర్కొన్నారు. కార్యక్రమంలో వై.వెంకటరమణ, ఎస్.వి.రమణమూర్తి, ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, వెంకటరావు, సరస్వతి, భాస్కరరావు, అరుణకుమారి పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

శ్రీకాకుళం రూరల్: ధాన్యం కొనుగోలు విషయంలో ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపడుతున్నట్లు జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం ఎంపీపీ అంబటి నిర్మల అధ్యక్షతన శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 2023–24కు సంబంధించి బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీ షరీఫ్ మాట్లాడుతూ ఎక్కడా రైతు నష్టపోకుండా ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేసిందన్నారు. మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొంటున్నట్లు డీటీ వివరించారు. నైరా ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని నైరా సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటా కుళాయి వేసినా ఎస్సీ కాలనీలో పూర్తికాలేదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పి.ఎన్. కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శత నామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. వేంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర ఆలయంలో స్వామిని తులసిమాలలతో అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సాయికుమార్



శ్రీకాకుళం రూరల్: వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: క్రీడల్లో పాల్గొనడం వల్ల శరీరక, మానసికోల్లాసంతోపాటు ఆరోగ్యంగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండలంలోని బంటుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఆడుదాం–ఆంధ్రా క్రీడల పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రతీ కార్యక్రమం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమనేన్నారు. ఇటీవల గ్రామాల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టి పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ఆడుదాం–ఆంధ్రా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ చిల్ల వెంకటరెడ్డి, బంటుపల్లి మాజీ సర్పంచ్ పాశపు ముకుందరావు, మండల మహిళా అధ్యక్షురాలు గురాన మానస, గ్రామ నాయకులు వాల్లె హరి, ఎండ తవుడు, పసుపురెడ్డి ఈశ్వరరావు, సీల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండల పరిధిలోని బైరివానిపేట, ముచ్చవానిపేట గ్రామంలో శనివారం వాలీబాల్, క్రికెట్‌లు పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రీడాకారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావుకు శుభాకాంక్షలు తెలియజేయాలనుకునే వారు బొకేలు, బహుమతులు తీసుకురావద్దని కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్ సీపీ మీడియాసెల్ ఇన్‌చార్జి మండవల్లి రవి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో విధిగా మాస్కులు ధరించాలని, కరోనా నిబంధనలు పాటించాలని కోరారు. పెద్దపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మంత్రి అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శిమ్మ రాజశేఖర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, కోణార్క్ శ్రీను, శ్రీకాకుళం పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు చౌదరి సతీష్, క్లస్టర్–2 అధ్యక్షుడు పాలకొండ అప్పారావు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



టోర్నమెంట్ వివరాలు వెల్లడిచేస్తున్న అర్జున్‌రెడ్డి, ఎమ్మెస్సార్, ఎస్వీడీ మురళి



ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరుగుతున్న మ్యాచ్

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహించడం, వారికి ఉజ్వలమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యమని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ కార్పొరేషన్ క్రీడా మైదానం వేదికగా శనివారం నగర పరిధి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రెండు రోజులపాటు పోటీలు కొనసాగనున్నాయి. 18 నుంచి 10 ఏళ్లలోపు నాలుగు బాలురు జట్లు, రెండు బాలికల జట్లను ఎంపిక చేసి టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. 8 నుంచి 10 ఏళ్లలోపు వారిని రెండు జట్లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, డీఎస్‌ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, ఏపీ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్ దేవ్(అను), సెపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీడీ మురళి, కోశాధికారి రాజు, సింహాచలం, అప్పారావు, వాకర్ సతీష్, సీనియర్ ప్లేయర్లు గణేష్, జయ, చిన్ను, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



పోటీలలో పాల్గొన్న బృందాలతో వర్సిటీ, కళాశాల అధికారులు



ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శన

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో శనివారం కళాశాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియం వేదికగా జరిగిన సంప్రదాయ, జానపద నృత్య పోటీల్లో వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి ఆకట్టుకునేలా ప్రదర్శనలు చేశారు. ఇక్కడ రాణించిన బృందాలు త్వరలో ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ కె.ప్రతిష్ఠ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మేనేజ్‌మెంట్ సభ్యులు, అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 27, 28, 29 తేదీల్లో శ్రీకాకుళం ప్రాంతీయ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ – 2023 శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పురుషులు, మహిళల్లో వ్యక్తిగత చాంపియన్‌షిప్, ఓవరాల్ చాంపియన్‌షిప్, గేమ్స్ చాంపియన్‌షిప్ సాధించారు. 47 మంది రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనే అర్హత సాధించారు. వీరికి మేనేజ్‌మెంట్ సభ్యులు, కళాశాల అధ్యాపకులు శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

మహా గాయకుడు ఘంటసాల



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి ధర్మాన తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: మహా గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని, ఆయన ఆలపించిన మధుర గీతాలు ఎప్పటికీ చిరస్మరణీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక లక్ష్మీకల్యాణ మండపంలో శనివారం ఘంటసాల 101వ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రముఖ గాయకుడు బి.ఎ.నారాయణ మాట్లాడుతూ ఘంటసాల పాటలు తెలుగు భాషకు వన్నె తెచ్చాయని చెప్పారు. అనంతరం స్థానిక గాయకులు కె.ఎల్.ఎన్.మూర్తి, మంగవేణి, ఎం.వి.కామేశ్వరరావు, రాజమోహన్ తదితరులు చక్కని గీతాలు ఆలపించారు. నృత్య దర్శకులు మెహర్ ప్రభాకర్ దర్శకత్వంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, బండారు చిట్టిబాబు, బలివాడ మల్లేశ్వరరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, డాక్టర్ కె.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణరాయభారం'



నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన సర్వేశ్వర నాట్యమండలికి చెందిన రాజాబాబు దర్శకత్వంలో శ్రీకృష్ణరాయభారం పౌరాణిక నాటక ప్రదర్శన ఆద్యంతం అలరించింది. అరసవల్లిలోని వైజయంతి మండపంలో సూర్యనారాయణ దేవస్థానం, సుమిత్ర కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న సంగీత, నాటక, నాదస్వరకచేరిలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు రంప జగదీశ్వరశర్మ, సమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, చిన్నారావు, ఫల్గుణరావు, నక్క శంకరరావు, కొంక్యాన మురళీధర్, బంకుపల్లి శంకరం తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ కిరణ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళా సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం అభినందనీయమని మెప్మా పీడీ కిరణ్ అన్నారు. మిషన్ డైరెక్టర్ మెప్మా విజయలక్ష్మి ఆదేశాల మేరకు మెప్మా పీడీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లోని రైతు బజార్ వద్ద శనివారం మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. త్వరలో పట్టణ సమాఖ్యల ద్వారా రెండు పట్టణ మహిళా ప్రగతి యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జగనన్న మహిళా మార్ట్, ఆహా క్యాంటీన్ల నిర్వహణ ద్వారా మహిళలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు



మంగువారితోటలో అక్షింతల ఊరేగింపు



బలగ హరేరామ మందిరంలో ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారితోటలో సంపత్ వినాయక దేవాలయానికి రామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శనివారం ఊరేగించారు. అర్చకులు ఆరవెల్లి మోహన కృష్ణమాచార్యులు, ధర్మకర్త కొండా రాంబాబుల ఆధ్వర్యంలో పురవీధుల్లో మంగళవాయిద్యాలు, భక్తులతో కలిసి ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా, బలగ హరేరామ మందిరంలో అర్చకులు బూరాడ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను రాముని పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

రిమ్స్ వైద్యుడిపై సస్పెన్షన్ వేటు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో హౌస్ సర్జన్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన డాక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తీసు కున్న చర్యలు తాత్కా లికమైనవని, పూర్తి విచారణ తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.